


# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి గురువారం 19-03-2026 సంపుటి: 01 సంచిక : 274 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Thursday 19-03-2026 Volume :01 Issue: 274 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani











WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి గురువారం 19-03-2026 సంపుటి: 01 సంచిక : 274 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Thursday 19-03-2026 Volume :01 Issue: 274 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani




Contact Number
9059328777




## ఇరాన్‌పై అమెరికా భారీ యాక్షన్

- హార్మోజ్ కోసం బంకర్ బస్టర్ల దాడి
- హర్మ్యూజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య
- 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రేటర్ బాంబుల ప్రయోగం
- అమెరికా తీరుపై మండిపడుతున్న ఇరాన్


వాషంగ్టన్

హార్ముజ్ జలసంధిని మళ్లీ ప్రారంభించేందుకు అమెరికా సైన్యం భారీ సైనిక చర్యకు దిగింది. ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న కఠిన రక్షణ గల మిస్సైల్ స్థావరాలపై 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రే టర్ బాంబులను వరుసగా ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సైళ్లు హార్ముజ్ మార్గంలో ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు పెద్ద ముప్పుగా మా రినట్లు తెలిపింది. ఈ దాడులతో ఆ ముప్పును నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇజ్రాయెల్ యుద్ధా నికి ప్రతిగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూ సివేయడంతో ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ప్రభావితమైంది.

-మిగతా 2 లో

## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు

- ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం
- ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి


2 లో

## చేసిందీ..చేయబోయేది

# స్పష్టం చేశాం

**సూచనలు ఇచ్చే ప్రయత్నం చేయని విపక్షం**

- గవర్నర్ ప్రసంగం దార్శనికతకు అద్దం
- తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించాం
- గవర్నర్‌ను ఆహ్వానించేందుకు కూడా రాని కేసీఆర్
- ఇంకా అహంకార ధోరణి వీడని కొందరు నేతలు
- కేసీఆర్ సభకు వచ్చి సూచనలు సలహాలు ఇవ్వాలి
- జీతాలు తీసుకుంటూ సభకు రాకుంటే ఎలా
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సీఎం సమాధానం



హైదరాబాద్

గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలా ముందుకు పోవాలో..పోతున్నదో ఇందులో వివరించామని అన్నారు. తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించిందన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. 'రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి అని ప్రతిపక్షంపై సీఎం మండిపడ్డారు.

-మిగతా 2 లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

ఉగాది శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం పత్రిక వెలువడదు

పునర్దర్శనం శనివారం




- యాజమాన్యం

## రాష్ట్రాలకు అదనంగా మరో పది శాతం ఎల్‌పీజీ

- తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

2 లో



## "మమ్మల్ని ప్రేమించి.. మోదీని పెళ్లి చేసుకున్నారు"

- దేవెగౌడపై ఖర్గే హాస్య విసుర్లు!
- రాజ్యసభలో ఖర్గే చలోక్తులు.. నవ్వు ఆపుకోలేకపోయిన ప్రధాని మోదీ!
- డేటింగ్ మాది.. పెళ్లి మోదీతో: దేవెగౌడ రాజకీయ ప్రస్థానంపై ఖర్గే సెటైర్లు.
- రాజ్యసభ వీడ్కోలు ప్రసంగంలో ఖర్గే 'లవ్ స్టోరీ' పంచ్‌లు!




న్యూఢిల్లీ :మార్చి 18 (నేటి దర్శిని)

ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే రాజ్యసభలో నవ్వులు పూయించారు. రాజ్యసభ నుంచి రిటైర్ అవుతున్న నేపథ్యంలో.. సభలో వీడ్కోలు ప్రసంగం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన సభలో జరిగిన అంశాలను ప్రస్తావించారు. తన రాజకీయ జర్నీ గురించి కొంత వివరించారు. ప్రస్తుత కాలపరిమితి ముగియడంతో.. మాజీ ప్రధాని దేవగౌడ, ఎన్సీపీ నేత శరద్ పవార్ కూడా వీడ్కోలు తీసుకుంటున్నారు.

-మిగతా 2 లో

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు


- రాజ్యసభ వీడ్కోలు సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు!
- పార్లమెంట్ ఒక 'ఓపెన్ యూనివర్సిటీ': రిటైర్ అవుతున్న ఎంపీలకు ప్రధాని సందేశం.
- ఖర్గే, దేవెగౌడ, పవార్ 'రాజకీయ మహాయోధులు': రాజ్యసభలో మోదీ ప్రశంసల జల్లు.
- సభ మారినా సేవ ఆగకూడదు
- 59 మంది సభ్యులకు ప్రధాని మోదీ ఘన వీడ్కోలు.



న్యూఢిల్లీ::మార్చి 18 (నేటి దర్శిని)

రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు.ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ

-మిగతా 2 లో



## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

- నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్
- 2029లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, :మార్చి 18 (నేటి దర్శిని)

మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు

-మిగతా 2 లో



## ముఖ్యమంత్రి పదవి ఆఫర్.. అయినా సరే నో చెప్పిన విజయ్!

- ఢిల్లీ ముందు తలవంచే ప్రసక్తే లేదు: స్పష్టం చేసిన టీవీకే నేత అధవ్ అర్జున.
- మొదట 50.. ఆపై సగం సీట్లు ఇస్తామన్నా దక్కని దళపతి మద్దతు!
- ఏప్రిల్ 23న తమిళ సమరం: పెరంబూర్ నుంచి బరిలోకి విజయ్?
- ఒంటరి పోరుకే మొగ్గు: బీజేపీ, కాంగ్రెస్ ప్రతిపాదనలను తోసిపుచ్చిన టీవీకే.

న్యూఢిల్లీ:: మార్చి 18 (నేటి దర్శిని)

టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు తమిళనాడులో ఒక జాతీయ పార్టీ సీఎం పదవి ఆఫర్ చేసిందని టీవీకే నేత అధవ్ అర్జున అన్నారు. అయితే, అది ఏ పార్టీయో వెల్లడించలేదు. ఆయన వ్యాఖ్యల్ని బట్టి, అది జాతీయ పార్టీ అని స్పష్టమవుతోంది. అయితే, ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించినట్లు అర్జున తెలిపారు. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ ప్రభావాన్ని కాదనలేం. ఆ పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు ఉన్న ఫాలోయింగ్ తప్పకుండా ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఆయన పార్టీ అధికారంలోకి వస్తుందా.. రాదా అంటే ఇప్పుడే చెప్పలేం. కానీ, ఓటర్లను ప్రభావితం చేయగలదు.అందుకే విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయన్నది ఒక ప్రచారం. ఇటీవల పలు సందర్భాల్లో కాంగ్రెస్ నేతలు విజయ్ పట్ల సానుకూలంగా మాట్లాడారు. ఇదే సమయంలో బీజేపీ నేతలు కూడా విజయ్‌ను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నించారని ప్రచారం మొదలైంది. మొదట ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. ఇదే అంశంపై టీవీకే నేత ఆదవ్ అర్జున మాట్లాడారు. ఒక జాతీయ పార్టీ విజయ్‌కు సీఎం పదవి ఆఫర్ చేసిందని వెల్లడించారు. అంతేకాదు.. మొదట 50 సీట్ల నుంచి మొదలై 90 సీట్లు, ఆపై సగం సీట్ల వరకు ఇచ్చేందుక సిద్ధమైనట్లు తెలిపారు. అయితే, సీఎం పదవి కోసం విజయ్ ఢిల్లీ ముందు తలవంచబోరని చెప్పారు. ఈ ఆఫర్‌ను విజయ్

-మిగతా 2 లో

## మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం

**మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ**



- డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా
- పేదల ఇళ్లు కూల్చివేత దారుణం
- బఫర్ జోన్ నిర్ణయంలోను అస్పష్టత
- అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కేటీఆర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ వాకౌట్

హైదరాబాద్ :మార్చి 18 (నేటి దర్శిని)

మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో

-మిగతా 2 లో

# ఇరాన్‌పై అమెరికా భారీ యాక్షన్

మొదటి తరువాయి

అనేక దేశాలకు చెందిన చమురు నౌకలు అక్కడే నిలి చిపోవడంతో సముద్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య హార్ముజ్ భద్రత కోసం సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్ర దేశాలను కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాటో దేశాలు కూడా సైనిక సహాయం విషయంలో వెనుకంజ వేశాయి. 'మేము ఎంతోసహాయం చేసినప్పటికీ మాకు మద్దతు రావడం లేదు' అంటూ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఈ దాడికి దిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అణు ఆయుధాల అభివృద్ధి దిశగా తాము సాగుతున్నామన్న అమెరికా ఆరోపణల ను ఇరాన్ ఖండించింది. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకే పరిమితమ ని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నెలలుగా ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ యుద్ధని ర్ణయాన్ని ముందుకు నెట్టినట్లు అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. బంకర్ బస్టర్ గా పిలిచే ఈ డీప్ పెనెట్రేటర్ బాంబులు భూమిలో లోతుగా దాగి ఉన్న లేదా బలమైన కాంక్రీట్ నిర్మాణాల్లో ఉన్న లక్ష్యాలను ఛేదించి పేలేలా రూపొందించారు. ఒక్కో బాంబు ధర లక్షల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో అమెరికా మరింత భారీ 30 వేల పౌండ్ల బాంబులను కూడా వినియోగించినప్పటికీ, ప్రస్తుత దాడిలో ఉపయోగించినవి. కీలక లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేసే విధంగా ప్రయోగించినట్లు సమాచారం.

# ఇరాన్‌కు వరుసఎదురు దెబ్బలు

**-ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం**

**-ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి**

**టెహ్రాన్,**



సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనే మరణం తర్వాత ఇరాన్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్‌పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బుధవారంనాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్టు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్‌జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇ్రజాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. శాంతికి ఇది సమయం కాదని, ఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌తో శాంతి కుదరదని చెప్పారు.

## "మమ్మల్ని ప్రేమించి..మోదీని పెళ్లి చేసుకున్నారు"

మొదటి తరువాయి

అయితే ఖర్గే తన ప్రసంగంలో దేవగౌడతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. దేవగౌడ గతంలో దేశ ప్రధానిగా చేశారని, ఎన్నో కీలక పదవుల్లో బాధ్యతలు నిర్వర్తించారని, ఆయన గత 54 ఏళ్లుగా తనకు పరిచయం ఉందని, ఆయనతో కలిసి పనిచేసినట్లు ఖర్గే తెలిపారు. అయితే ఏం జరిగిందో ఏం తెలియదు కానీ, తమతో డేటింగ్ చేసి, తమను ప్రేమించిన అతను.. ప్రధాని మోదీని పెళ్లి చేసుకున్నారని అన్నారు. దీంతో సభలోని సభ్యులందరూ నవ్వేశారు. అక్కడే ఉన్న ప్రధాని మోదీ కూడా నవ్వు ఆపుకోలేకపోయారు .996 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఓ ఏడాది కాలం పాటు ప్రధానిగా దేవగౌడ చేశారు. యూనైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్, కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. ఆ ఫైట్‌లో ఆ కూటమి గెలిచింది. హెచ్‌డీ కుమారస్వామి సీఎం అయ్యారు. కానీ 2019లో ఆ ప్రభుత్వం కూలింది. ఆ తర్వాత బీజేపీతో జేడీఎస్ జతకట్టిన విషయం తెలిసిందే. ఖర్గే తన ప్రసంగంలో మాట్లాడుతూ.. శరద్ పవార్, తిరుచ్చి శివతోనూ తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెప్పారు. అయితే ఆ ఇద్దరీ మళ్లీ రాజ్యసభలోకి ఎంటర్‌కానున్నారు. కేంద్ర మంత్రి అత్వాలే గురించి ప్రస్తావిస్తూ.. ఆయన తన పద్యంలోని ప్రధాని మోదీని మెచ్చుకుంటారని, ఇక ఆయనకు మరో పద్యం రాదు అని అన్నారు. దీంతో సభ్యులు నవ్వుకున్నారు.

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

మొదటి తరువాయి

పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు.రాజ్యసభలో సీనియర్ సభ్యులుగా ఉన్న మాజీ ప్రధాని దేవగౌడ, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే, ఎన్సీపీ నేత శరద్ పవార్‌పై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఆ ముగ్గురూ రాజకీయాల్లో మహాయోధులన్నారు. పార్లమెంట్ కోసం వారి సగం కన్నా ఎక్కువ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వారు సభలకు హాజరువుతున్న తీరు, వారిలో అంకితభావం అసాధారణమైందన్నారు. కొత్తగా ఎంపికైన ఎంపీలు వారి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని ఆశించారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు.పార్లమెంట్ ప్రక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి పదవి ఆఫర్.. అయినా సరే నో చెప్పిన విజయ్!

మొదటి తరువాయి

తిరస్కరించారని అర్జున అన్నారు.అది ఏ పార్టీయో చెప్పకపోయినప్పటికీ బీజేపీయే అని కొందరు టీవీకే నేతలు అంటున్నారు. ఇటీవల విజయ్ కూడా ఈ ఎన్నికల వరకు తమ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేశారు. వచ్చే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. విజయ్ పార్టీతో తమ పార్టీ చర్చలు జరపడం లేదని ఏఐఏడీఎంకే కూడా ఇటీవల స్పష్టం చేసింది. బీజేపీ మాత్రం అధికార డీఎంకేను ఓడించాలంటే పొత్తు అవసరం అని భావిస్తోంది. ఈ ఎన్నికల్లో మాత్రం విజయ్ పార్టీ టీవీకే ఒంటరిగానే పోటీ చేసే అవకాశాలున్నాయి. విజయ్ తన పార్టీ అభ్యర్థుల జాబితాను ఒకట్రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశాలున్నాయి. విజయ్ పెరంబూర్ నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పార్టీకి చెందిన మరో కీలక నేత ఎన్ ఆనంద్ టీ నగర్ నుంచి, జనరల్ సెక్రెటరీ అధవ్ అర్జున విల్లివక్కం నుంచి పోటీ చేస్తారు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఎన్నిక జరగనుంది. మే 4న ఫలితాలుంటాయి.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

మొదటి తరువాయి

రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు. పార్లమెంట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.

# చేసిందీ..చేయబోయేది స్పష్టం చేశాం

మొదటి తరువాయి

ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు.కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం. గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. ఇదే సందర్భంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చిన కనీసం శుభాకాంక్షలు తెలిపేందుకైన ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ సభ రాడా.. సభకు రావాల్సిన బాధ్యత లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని.. బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలే తప్పు చేసినట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారం పోయినా ఇంకా అదే అహంకారంతో ఉన్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆయనకు ఉన్న అనుభవంతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తామని తెలిపారు. 4 కోట్ల ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉందని తమ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలతో ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకం. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి విశిష్ట ప్రణాళిక. ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి హుందాగా ధన్యవాదాలు తెలుపుతుందని ఆశించాం. అభివృద్ధిలో కలిసి వస్తారని ఆశించాం.. కానీ అహంకారం ప్రదర్శించారు. 4 కోట్ల మంది ప్రజలను నిరాశ పర్చేలా ప్రతీపక్షాల తీరు ఉందన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను పక్క దారి పట్టించారు. ప్రతిపక్షంలో కూర్చొబెట్టిన వాళ్ల తీరు మారలేదు. సభ సంప్రదాయాలను విపక్ష నేత గౌరవించకపోవడం రాష్ట్రానికి మాయని మచ్చ. ప్రతిపక్ష నాయకుడు ఇప్పటిదాకా కోటీ 6 లక్షలకు పైగా జీతభత్యాలు పొందారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని అన్నారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ విధానాలే కారణం. పీవీ నరసింహారావు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది రాయి వేశారు. అనంతరం చంద్రబాబు, వాజ్‌పేయీ హైటెక్ సిటీని పూర్తి చేశారు. ప్రస్తుతం ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి



నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది. సవాళ్లను ఎదుర్కోవడంపై విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టాం' అని సీఎం అన్నారు. గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల జాబితా కాకుండా, భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబించిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని చూపించిందని చెప్పుకొచ్చారు. భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలకు బలమైన పునాది వేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం చరిత్రాత్మకమని ఉద్ఘాటించారు. గవర్నర్ చేసిన ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచనలు కాదని.. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి అని వ్యాఖ్యానించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రం ఎదగడానికి అవసరమైన విశిష్ఠ ప్రణాళిక అని తెలిపారు. అలాంటి గొప్ప సంకల్పాన్ని, పవిత్ర శాసన సభ వేదిక నుంచి రాష్ట్ర ప్రజల ముందు ఉంచిన గవర్నర్ శుక్లాకి ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ వస్తారని అనుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్త గవర్నర్‌కు కేసీఆర్ శుభాకాంక్షలు చెబుతారని భావించామని.. కానీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు రాలేదని ప్రశ్నించారు. ప్రజలు బుద్ధిచెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఇప్పుడూ అదే తీరుగా బీఆర్ఎస్ నేతలు ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. డిసెంబర్ 1, 2023 నుంచి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రూ. 1.6కోట్లకు పైగా జీతభత్యాలు పొందారని ప్రస్తావించారు. అసెంబ్లీలో కేసీఆర్ తన విధులకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై ఒక నిర్ణయం తీసుకోవాలని అన్నారు.ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలని, వస్తారని ఆశిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని గవర్నర్ ప్రసంగంలో వివరించారని అన్నారు. సంక్షోభ సమయంలో దేశ ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. నెహ్రూ తీసుకున్న ప్రణాళికలతోనే ఇవాళ దేశం ఈ పరిస్థితుల్లో ఉందని తెలిపారు. మొదటి తరంలో నెహ్రూ- ఇందిరాగాంధీ గొప్ప విధానాలు తీసుకువచ్చారని ఉద్ఘాటించారు. సరళీకృత విధానాలతో దేశ ఆర్థిక గతిని మార్చిన ఘనత పీవీ నరసింహారావుదని తెలిపారు. 1990 నుంచి 2020 వరకు 30 ఏళ్లు పీవీ నరసింహారావు నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ప్రస్తావించారు. భవిష్యత్తులో ఏఐ సునామీ రాబోతుందని చెప్పుకొచ్చారు. దీనిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించిన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను గవర్నర్ తన ప్రసంగంలో వివరించారని అన్నారు. ప్రతిపక్ష నాయకులు తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను కనీసం చదివారా..? చూశారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించకపోతే తర్వాత తరాలు మనల్ని క్షమించవని హితవు పలికారు. ఇది నవశకానికి నాంది పలుకాల్సిన సమయమని నొక్కిచెప్పారు.

అధికారం కోల్పోయామనే దు:ఖమే తప్ప ప్రభుత్వానికి సహకరించాలనే ఆలోచన ప్రధాన ప్రతిపక్షానికి లేదని ఆగ్రహించారు. అందుకే ఎవరు అడ్డుపడ్డా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. అన్ని రంగాల మేధావులతో సమన్వయం చేసుకుని తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించుకున్నామని వివరించారు. తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రాలకు అదనంగా మరో పదిశాతం ఎల్‌పీజీ

## తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,

: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా దేశంలో తలెత్తిన ఎల్‌పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీ అందించేందుకు అంగీకరించింది. అయితే ఎల్‌పీజీ భారాన్ని తగ్గించి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు సరఫరా వర్తిస్తుందని తెలిపింది. ఆ ప్రకారం ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేలా రాష్ట్రాలు ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం చేయాల్సి ఉంటుంది.




దేశీయ వంటగ్యాస్ సరఫరాకు ఆటకం కలగకుండా చూడటం, వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత తీర్చడం ప్రభుత్వ ముఖ్యోద్దేశమని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లయితే 1 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని, డీమ్డ్ సీజీడీ పర్మిషన్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే 2 శాతం, రోడ్ల తవ్వకం, మరమ్మతు పథకం ప్రవేశపెడితే 3 శాతం, వార్షిక రెంటల్/లీజ్ తగ్గిస్తే 4 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని ఆమె చెప్పారు. ఎల్‌పీజీ అంశం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ పరిస్థితి మెరుగుపడిందని సుజాత శర్మ తెలిపారు. ఈనెల 17న 2,300కు పైగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, ఎల్పీజీ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించేందుకు హాస్పిటాలిటీ, రెస్టారెంట్లతో సహా పలు రంగాలకు కిరోసిన్, బొగ్గు సరఫరాలకు కేంద్రం ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

# మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం

మొదటి తరువాయి

సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంతో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వంవద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ౯÷వ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

● జిల్లా ఎస్పీ డి. జానకి ఐపిఎస్

**మిడ్జిల్,మార్చి 18, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ డి.జానకి ఐపిఎస్ 'శ్రీ పరాభవ' నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది (చైత్ర శుద్ధ పాడ్యమి) తెలుగు వారి సాంప్రదాయ నూతన సంవత్సరాది, ఇది వసంత రుతువు ప్రారంభాన్ని కొత్త ఆశలను సూచిస్తుందని అన్నారు. బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించిన రోజుగా ప్రతీతి అని, షడ్రుచుల (6 రుచుల) ఉగాది పచ్చడి జీవితంలోని సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఇస్తుందనీ పేర్కొన్నా రు. ఉగాది మన వారసత్వ పు పండుగ అని ఆయన అభివర్ణించారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళలు జాతిని సజీవంగా నిలుపుతాయని తెలిపారు.ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని ఎస్పీ డి. జానకి ఆకాంక్షించారు. సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అభిలాషించారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల్లో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పండగ అన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. రైతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధితో అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. జీవితం కష్టసుఖాల సమ్మేళనం, ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో తెలంగాణతో పాటు, దేశం మరింత అభివృద్ధి సాధించాలి అని ఎస్పీ డి.జానకి ఆకాంక్షించారు.






మిడ్జిల్ మండలంలోని వాడియాల గ్రామానికి చెందిన రంగస్థలం నటుడు ఆనగల బిక్షపతి హైదరాబాదులో యూసుఫ్ గూడా ఫిలింసిటీ లో ప్రముఖ నటుడు బాబు మోహన్ గారిని కలవడం జరిగింది తెలంగాణ డిస్ట్రిబ్యూటర్ డబ్బింగ్ రాజు గారిని కూడా కలవడం జరిగింది ఈ సందర్భంగా బిక్షపతిని బాబు మోహన్ అభినందించడం జరిగింది..
(నేటి దర్శిని ప్రతినిధి మిడ్జిల్)

## సిసి రోడ్డును ప్రారంభోత్సవం


● చేసిన బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి



**మిడ్జిల్, మార్చి 18, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో దళితవాడలో శ్రీమతి డీకే అరుణమ్మ గారి నిధులతో సిసి రోడ్డుని సర్పంచ్ కాటేపాగ రేవతి ఆనంద్ గారి ఆధ్వర్యంలో సిసి రోడ్డుని ప్రారంభించిన బిజెపి నాయకుడు ముచ్చర్లపల్లి జనార్ధన్ రెడ్డి పాల్గొన్నవారు రాజాపూర్ మండల అధ్యక్షులు కాటేపాగ ఆనంద్ గ్రామ సెక్రెటరీ కేశవులు వార్డు మెంబర్లు మహేష్ సువర్ణ పోచయ్య నరేష్ చిన్న నరసింహులు కృష్ణయ్య యాదయ్య వెంకటేష్ విజయ్ రమేష్ రామచంద్రయ్య వెంకటయ్య తదిరులు పాల్గొన్నారు...

## మాతృమూర్తి రాములమ్మకు పాత్రికేయుల ఘన నివాళి

**మిడ్జిల్ మార్చి 18, (నేటి దర్శిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):**
మిడ్జిల్ మండలం ఆంధ్రప్రభ రిపోర్టర్ పోలేపల్లి సత్యనారాయణ గౌడ్ మాతృమూర్తి పోలేపల్లి రాములమ్మ ఇటీవల పరమపదించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె దశదినకర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి మండలంలోని పలు పత్రికల పాత్రికేయులు హాజరై రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ, రాములమ్మ సాధారణ గృహిణిగా ఉన్నప్పటికీ కుటుంబానికి విలువలు నేర్పిన మహనీయురాలని కొనియాడారు. ఆమె జీవితం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం టీయూడబ్ల్యూజే ఐజేయు మండల అధ్యక్షులు, ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ఎన్నం మహేష్ కుమార్ మాట్లాడుతూ, "తల్లి అనేది ప్రతి మనిషి జీవితంలో అమూల్యమైన స్థానం కలిగినది. పోలేపల్లి సత్యనారాయణ గౌడ్ గారి తల్లి రాములమ్మ గారు ఎంతో సహనంతో, ప్రేమతో కుటుంబాన్ని నిలబెట్టిన గొప్ప వ్యక్తి. ఆమె మరణం కుటుంబానికి మాత్రమే కాదు, మాకు కూడా తీరని లోటు. ఇలాంటి సమయంలో మనం అందరం కుటుంబానికి అండగా నిలబడాలి. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను" అని అన్నారు.ఈ కార్యక్రమంలో నేటి దర్శిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో బాస. బాల్ నారాయణ మన తెలంగాణ రిపోర్టర్ శ్రీను, లోకల్ గైడ్ రిపోర్టర్ శీను నాయక్, వెలుగు రిపోర్టర్ మల్లేష్, నమస్తే తెలంగాణ రిపోర్టర్ వరుణ్ రాజ్, వార్త రిపోర్టర్ పరంజ్యోతి, జనం సాక్షి రిపోర్టర్ భీమ్ రాజ్, మన ఊరు రిపోర్టర్ వై శ్రీనివాసులు, దిశా రిపోర్టర్ నిస్సార్ తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.కార్యక్రమం అంతటా శోక వాతావరణం నెలకొనగా, కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతూ పలువురు పరామర్శించారు. రాములమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ ప్రార్థించారు.



## ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలి!




**యాచారం, మార్చి 18,(నేటిదర్శిని):**
ఎన్నికలకంటే ముందు ఇచ్చిన హామీలు, ప్రభుత్వం ఏర్పాడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నెరవేర్చలేదని బుధవారం యాచారం మండల బిజెపి అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందట బిజెపి నాయకులు, కార్యాకర్తలతో కలిసి నిరసన చేస్తూ,ఆర్ ఐ మురళి కృష్ణ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు బాషా,రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యాదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్ హాజరై, మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు రైతు భరోసా, పింఛన్లు, నిరుద్యోగ భృతి, దళిత బందు, కళ్యాణ లక్ష్మి, మహిళలలకు భరోసా, డబల్ బెడ్ రూం ఇండ్లు తదితర హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో ఆమలు చేయలేదని మండిపడ్డారు.చేయలేని హామీలను ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తూ, చేయలేని పక్షంలో గద్దె దిగాలన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి కొండా మధుకర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు నాగిని యాదయ్య, ఆంబోజి జగదీశ్ యాదవ్,గోగికర్ రమేష్,దెరంగుల రాజు, తాంద్ర రవీందర్, బిజెపి సర్పంచ్ లు ఆంబోజి రమేష్, బాలరాజు,రాయికంటి విజయ్ కుమార్, వీరితో పాటు ఉపసర్పంచ్ లు వార్డ్ మెంబెర్స్ అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖమ్మం ప్రెస్ క్లబ్‌ను రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతా

● అంతోటి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు
● భారతదేశపు తొలి సంపాదకులు, విలేకరుల చిత్రపటాల ఆవిష్కరణ

**ఖమ్మం, మార్చి18 (నేటి దర్శిని):**
ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్ 2843) ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారతదేశపు తొలి సంపాదకులు, విలేకరుల చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు, కార్పొరేటర్ నాగండ్ల దీపక్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రాంగణం జర్నలిస్టుల గౌరవానికి ప్రతీకగా నిలిచింది. చిత్రపటాల ఆవిష్కరణ అనంతరం నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ, సమాజంలో జర్నలిస్టుల పాత్ర అపారమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో వారు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. తొలి తరం జర్నలిస్టులు ఎటువంటి ప్రయోజనాలు ఆశించకుండా సమాజ హితం కోసం పనిచేసిన త్యాగధనులని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్లు వారి హక్కుగా , వాటి పరిష్కారానికి తాను కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ మాట్లాడుతూ, అంతోటి శ్రీనివాస్ నాయకత్వంలో ప్రెస్ క్లబ్ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, యూనియన్‌లను సమన్వయం చేస్తూ ప్రెస్ క్లబ్ ప్రతిష్టను పెంచుతున్న తీరు అభినందనీయం అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రెస్ నోట్ క్లబ్ వార్షికోత్సవం, మహిళా దినోత్సవ కార్యక్రమాలు వంటి పలు సేవా కార్యక్రమాల ద్వారా ప్రెస్ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఖమ్మం ప్రెస్ క్లబ్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మోడల్ ప్రెస్ క్లబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. తాను ప్రెస్ క్లబ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత, అత్యంత ఘనంగా ప్రెస్ క్లబ్ 24వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించామని, సీనియర్ పాత్రికేయులు మోతుర్కారి వెంకటేశ్వర్లును స్మరించుకున్నామని, మొక్కలు నాటే కార్యక్రమం, మహిళా జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమం, ప్రఖ్యాత జర్నలిస్టుల చిత్రపటాలతో ప్రెస్ క్లబ్బుకు వన్నె తెచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.డబ్ల్యూ. జె.ఎఫ్.హెచ్ 2843 జిల్లా కోశాధికారి అరవపల్లి నగేష్, టీబీజేఏ జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్త,కుంభం రవికుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి, టీబీజేఏ నగర అధ్యక్షుడు వి.ఆర్.ఎమ్. వెంకట్, కప్పల మధు, మొగిలి నాగేశ్వరరావు, నల్లా రాకేష్, వెలిగొండ వెంకట్, ఓరుగంటి కిరణ్, షేక్ మీరా, ఎర్ర రాజేంద్రప్రసాద్, చల్లగొండ సతీష్, కందరబోయిన నాగకృష్ణ,పాగ యోనా, వేములకొండ రమేష్, మామిడాల వీరబాబు, యే లిశెట్టి రామకృష్ణ, గరిపెల్లి మహేష్, పోయిలబోయిన శ్రీను, వంగ పవన్ గౌడ్, లింగాల రామ్మూర్తి గౌడ్, మద్దెల చెన్నప్ప, చిన్నంశెట్టి రాంబాబు, వందనపు సామ్రాట్ గుప్తా తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



### తెలంగాణ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ

**దేవరకొండ, మార్చి 18 ( నేటి దర్శిని):**
నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలకు మరియు వడ్డెర సోదర సోదరీమణులకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "తెలుగు వారి తొలి పండుగ ఉగాది అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను. ఈ పరాభవ నామ సంవత్సరంలో ప్రకృతి కరుణించి, సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు.ఈ కొత్త ఏడాదిలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు.



# ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

(నేటి దర్శిని):/ రాయికల్ మార్చి 18,
రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీవిద్యార్థులు ఉగాది పచ్చడిని తయారు చేసి పాఠశాలలోని తమ మిత్రులందరికీ పంచడం జరిగింది.పాఠశాల ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ ఉగాది తెలుగువారి తొలి పండుగ. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు సృష్టి ఆరంభమైందని నమ్మకం. ఇది కొత్త సంవత్సరానికి, ఆశకు, నూతనోత్తేజానికి చిహ్నం. షడ్రుచుల సమ్మేళనం, కొత్త పనులు ఆరంభించడం, పంచాంగ శ్రవణం ఈ పండుగ విశేషాలు. జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని, ఉగాది పచ్చడి వేపపువ్వు-చేదు, బెల్లం-తీపి ద్వారా ఈ పండు

"ఉగ" అంటే నక్షత్ర గమనం, "ఆది" అంటే ఆరంభం.నక్షత్ర గమనానికి ఆది మొదలు కాబట్టి దీనిని ఉగాది అంటారు. ఉగాది అంటే సృష్టి ఆరంభమైన దినం. మనందరి జీవితాల్లో కొత్త ఆశలను, ఆనందాలను తీసుకువచ్చే కొత్త సంవత్సరం. ఉగాది రోజున ఇళ్లన్నీ శుభ్రం చేసుకుని, ముగ్గులతో, మామిడి తోరణాలతో అలంకరిస్తాం. కొత్త బట్టలు ధరించి, గుడికి వెళ్తాము. ఈ పండుగలో అత్యంత ముఖ్యమైనది ఉగాది పచ్చడి. ఈ పచ్చడిలో ఆరు రుచులు షడ్రుచులు ఉంటాయి.





తీపి బెల్లం : సంతోషం
కారం మిరియాలు : ఆగ్రహం
చేదు వేపపువ్వు : బాధ/కష్టం
ఉప్పు: భయం
పులుపు: వికారం
వగరు: ఆశ్చర్యం

ఈ ఆరు రుచులు జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలు, ఆరోపణలు, సంతోషాల సమ్మేళనానికి సంకేతం. జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో ఈ పచ్చడి మనకు నేర్పుతుంది. ఈ పండుగ రోజున పంచాంగ శ్రవణం వినడం వల్ల, వచ్చే ఏడాది కాలం ఎలా ఉండబోతుందో తెలుసుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. కాబట్టి, ఈ ఉగాది నుండి మన పాత బాధలను, చేదు జ్ఞాపకాలను మర్చిపోయి, బెల్లంలాంటి తీపి జ్ఞాపకాలతో కొత్త ప్రయాణాన్ని మొదలుపెడదాం.

మరోసారి అందరికీ ఉగాది శుభాకాంక్షలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత ,విద్యాన్వేష్ ఉపాధ్యాయులు మహేష్ ,రంజిత్, వెంకటేష్ ,అప్సర్ , షారు ,రజిత, సంజన ,మంజుల ,శ్రీజ ,స్రవంతి, సౌజన్య ,నిహారిక, అనూష, మమత, సాయి హర్ష తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు స్ఫూర్తి కార్యక్రమం ఎంతో ఉపయోగం: జిల్లా కలెక్టర్



ఉమ్మడి వరంగల్, మార్చి 18(నేటి దర్శిని బ్యూరో):
విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు, మానసిక దృఢత్వం పెంపొందించడానికి స్ఫూర్తి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద విద్యార్థులకు వివరించారు. బుధవారం వరంగల్ నగరంలోని సీకేఎం కళాశాలలో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీజీ, డిగ్రీ విద్యార్థులతో పాటు పాఠశాల పిల్లలతో ముచ్చటిచ్చి వారి భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈద్ కా తోఫా కిట్లను ముస్లింలకు అందజేసిన మంత్రి కొండా సురేఖ



ఉమ్మడి వరంగల్, మార్చి 18 (నేటి దర్శిని బ్యూరో):
పండుగలను అందరూ సోదర భావంతో జరుపుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం వరంగల్ ఎల్బీనగర్ క్రిస్టల్ గార్డెన్లో నిర్వహించిన ఈద్ కా తోఫా కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొని, లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున కిట్లను పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద, ఆర్డీఓ సుమ, కార్పొరేటర్లు , అధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటించి మద్యం సేవించకుండా వాహనాలతో సురక్షితంగా ఇంటికి చేరుకోండి

- చెన్నూర్ టౌన్ సి ఐ బన్సీలాల్.



(నేటి దర్శిని): ,చెన్నూర్, మార్చి 18
మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలొ రామగుండం సీపీ మంచిర్యాల డీసీపీ, జైపూర్ ఏసీపీ ఆదేశానుసరం చెన్నూర్ పట్టణం లోని ఆస్నాద్ చౌరస్తా జాతీయ రహదారిపై పోలీసుల విస్తృత తనిఖీలు.రాష్ట్ర డీజీపీ చేపట్టిన "ఎర్రివ్ అలీవ్" కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులపై నాలుగు కేసులు నమోదు చేయడం జరిగినది.ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి త్రిబుల్ రైడింగ్ నడిపే వారికి ,వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు లేని వారికి ఈ- చల్లన్ కేసులు బుక్ చేసి జరిమానాలు విధించడం జరిగినది.గత కొద్ది కాలంగా మద్యం సేవించి వాహనాలు నడుపుచుండటం వల్ల ప్రమాదాలు జరిగి ,అందువల్ల విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని వాటిని అరికట్టేందుకే ఈ స్పెషల్ డ్రైవ్ చేయడం జరిగినది. ట్రాఫిక్ రూల్స్ ప్రతీ ఒక్కరు పాటించి మద్యం సేవించి వాహనాలు నడుపకుండా ప్రతి ఒక్కరు తమ ఇంటికి సురక్షితంగా చేరుకోవాలన్నదీ ఈ ఎర్రివ్ అలీవ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం.చెన్నూర్ టౌన్ సి ఐ బన్సీలాల్.

# మంథని మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభం





(నేటి దర్శిని):/మంథని,మార్చి18:
మంథని మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం రోజున నిర్వహించారు.ఈ పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ ఓడ్నాల శ్రీనివాస్,వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ ఎంపిక పోటీలలో మూడవ తరగతి చదువుతున్న సుమారు 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు.ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థులు,మార్చి 28 నుండి పెద్దపెల్లి జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ దాసరి లక్ష్మి తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సురేష్, సోమన్ పల్లి సర్పంచ్ దామోదర్,వ్యాయామ ఉపాధ్యాయులు కొమ్రోజు శ్రీనివాస్,అవధానుల మాధురి,సిఆర్పి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు..

# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న బ్యాండ్ మేళం సినిమా యూనిట్



ఉమ్మడి వరంగల్, మార్చి 18 (నేటి దర్శిని బ్యూరో):
వరంగల్ నగరంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి దేవాలయంలో బుధవారం బ్యాండ్ మేళం సినిమా బృందం హీరో హర్ష రోషన్, హీరోయిన్ శ్రీదేవి, దర్శకుడు సతీష్ జివాజి, నిర్మాత కోన వెంకట్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చిత్ర బృందానికి తీర్థప్రసాదాలు అందజేశారు. చిత్ర బృందాన్ని చూసేందుకు భక్తులు అభిమానులు భారీగా తరలివచ్చారు. వారితో ఫోటోలు దిగేందుకు యువత పోటీపడ్డారు.

# బీసీలకు బడ్జెట్‌లో రూ.60వేల కోట్లు కేటాయించాలే

- బీసీ కుల సంఘాల కార్పోరేషన్‌లు ఏర్పాటు చేయాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





(నేటి దర్శిని): /హైదరాబాద్
రాష్ట్రంలోని బీసీల సంక్షేమానికి కట్టుబడి ఈ బడ్జెట్‌లో బీసీలకు రూ.60వేల కోట్లు కేటాయించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ లక్డికాపూల్ లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగానే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వివిధ బీసీ కుల సంఘాల కార్పోరేషన్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు....

# ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

- మక్కలను మార్క్ఫెడ్ ద్వారా 2400 మద్దతు ధరతో కొనుగోలు చేయాలి
- రైతాంగ సమస్యల పరిష్కారానికై కలెక్టరేట్‌లో ధర్నా



(నేటి దర్శిని):/మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం :- మార్చి 18 .
ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతాంగానికి మేలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు నల్లు సుధాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వర్ రావు డిమాండ్ చేశారు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం మహ బాద్ జిల్లా కలెక్టరేట్ లో ధర్నా నిర్వహించి జిల్లా అదనపు కలెక్టర్ కే అనిల్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మక్కలు ఈసారి అధికంగా రైతులు సాగు చేశారని వాటిని మార్క్ ఫెయిర్ ద్వారా 2400 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని, సాదా బై నామా కేవలం పత్రిక ప్రకటనలకు మాత్రమే పరిమితం అయినాయని రైతులకు ఆచరణలో ఏమాత్రం అమలు కావడం లేదు కాబట్టి కొర్రీలు లేకుండా సాదా బైనామాలను రైతాంగానికి అందుబాటులో తేవాలని, రెండు లక్షలకు పైనున్న రైతుల పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని, రైతు భరోసా నిధులను వారి ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తండ సతీష్, రామగోని రవి, వెంకటేశ్వర్లు, ఉపేందర్ రుణవత్ రమేష్, జిన్నా వీరయ్య తరులు పాల్గొన్నారు

# ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి ని కలిసిన ఎర్రబెల్లి స్వర్ణ



ఉమ్మడి వరంగల్, మార్చి 18(నేటి దర్శిని బ్యూరో):
తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. మహిళ రాష్ట్ర అధ్యక్షురాలుగా తన నియామకానికి సహకరించినందుకు ఆమె మంత్రికి ధన్యవాదాలు తెలిపారు .రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి కృషి చేయాలని మంత్రి స్వర్ణకు సూచించారు .ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, కార్పొరేటర్ గుండేటి నరేందర్, నల్గొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పండగల నేపథ్యంలో హనుమాన్ గుడి, ఈద్గా


● పరిసరాల పరిశుభ్రతను పర్యవేక్షిస్తున్న చైర్మన్.....



**ఆమనగల్, మార్చి18(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ పట్టణంలో ఉగాది మరియు రంజాన్ పండగలను పురస్కరించుకొని ఈద్గా మరియు అంగడిబజార్ లోని ఆంజనేయ స్వామి దేవాలయం పరిసరాల్లో మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్ మున్సిపాలిటీ సిబ్బందితో పరిసరాలశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్గా వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ కోగూరి అనితా శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కృష్ణా నాయక్,ఖాదర్ ఖాద్రి,ఖాదర్,ఎండి అబ్దుల్ రహీం,నయీమ్, హలీం,తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ పార్లమెంట్ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

● బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్, మార్చి 18, (మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** మహబూబ్ నగర్ జిల్లా పార్లమెంట్ ప్రాంతానికి చెందిన ప్రజలకు బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలకు నాంది పలికే శుభదినమని పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖశాంతులతో జీవిస్తూ, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాలలో ఆనందం, శాంతి నెలకొని, సమాజం మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ఈ ఉగాది ప్రతి ఇంటా సంతోషాన్ని తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. మీ జీవితంలో ప్రతి రోజు ఉగాది లాంటి కొత్త ఆరంభంగా మారాలని, సుఖశాంతులు, ఐశ్వర్యాలు ఎల్లప్పుడూ మీ వెంట ఉండాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు.

# ఉగాదితో ప్రజల జీవితాల్లో వసంతం వెల్లివిరియాలి

● బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

**మిడ్జిల్,మార్చి 18, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** ఉగాది పండుగ ప్రజల జీవితాల్లో వసంతం వెల్లివిరియాలి అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మికాంత్ రెడ్డి కోరుతూ ప్రజలకు పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నారాయణపేట జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది పండు గను ప్రజలంతా ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకోవాలని, అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.జీవితంలో తీపి, చేదు, కష్టాలు, సుఖాలు సహజమని, వాటిని సమా నంగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి ఉగాది పండుగను ఆనందంగా జరు పుకోవాలని కోరారు.ప్రపంచ మానవాళికి అన్నం పెట్టే రైతన్నలకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, సిరి సంపదలతోసుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.జిల్లా ప్రజలు శాంతి భద్రత లను పాటిస్తూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని వారు కోరారు

# పలు గ్రామాల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన సర్పంచులు..



మున్ననూర్ గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి



చిల్వేర్ గ్రామ సర్పంచ్ బోల్గం. నాగరాజ్ గౌడ్



మిడ్జిల్ మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య

- మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య,
- చిల్వేర్ గ్రామ సర్పంచ్ నాగరాజ్ గౌడ్
- మున్ననూర్ గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి
- వాడియాల గ్రామ సర్పంచ్ టి. చంద్రయ్య గౌడ్

**మిడ్జిల్,మార్చి 18, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల వివిధ గ్రామ సర్పంచులు మిడ్జిల్ మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య, చిల్వేర్ గ్రామ సర్పంచ్ నాగరాజ్ గౌడ్, మున్నూరు గ్రామ సర్పంచ్ చిట్టశీపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి, వాడియాల గ్రామ సర్పంచ్ టి. చంద్రయ్య గౌడ్, గ్రామ ప్రజలకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పర్వదినం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. చెట్లు పచ్చగా చిగురిస్తూ, ప్రకృతి మాత నూతనోత్సాహాన్ని సంతరించుకుంటుందని, అదే నూతనోత్సాహం ప్రజల జీవితాల్లో నిండాలని కోరుకున్నారు. రైతన్నలు, సబ్బండ వర్గాల సంక్షేమం దిశగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టి, ప్రజల జీవితాల్లో మరింతగా గుణాత్మక మార్పును తీసుకురావాలని ఆశించారు. ఉగాది పచ్చడి మాదిరి, జీవితంలో షడ్రుచులను ఆస్వాదిస్తూ ప్రతీ సందర్భాన్ని వివేచనతో ఎదుర్కోవడం ద్వారానే మంచి చెడులు అర్థమై జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని నల్లమోతు భాస్కర్ రావు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో సాగునీరు తాగునీరు పుష్కలంగా లభించి, సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని వివిధ గ్రామ సర్పంచులు ఆకాంక్షించారు.



వాడియాల గ్రామ సర్పంచ్ టి.చంద్రయ్య గౌడ్

# అమ్మవార్ల ఆశీస్సులు అందరి మీద వుండాలి



● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



**పెద్ద అంబర్ పేట, మార్చి18 (నేటి దర్శిని):** పెద్ద అంబర్ పేట సంగీ టెంపుల్ రోడ్డు లో గల తన సాయి శ్రీనివాస బాటిల్స్ కంపెనీ ప్రాంగణంలో ఘనంగా ఎల్లమ్మ తల్లి, ఉప్పలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఉప్పలమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రాంత ప్రజల శ్రేయస్సు, శాంతి, సౌభాగ్యాల కోసం ఆ అమ్మవార్ల ఆశీస్సులు అందరి మీద వుండాలి అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. మన సంప్రదాయాలు, పండుగలు మన సంస్కృతికి ప్రతీకలని, వాటిని భక్తి భావంతో కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐ వి ఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న కుమారుడు ఉప్పల సాయి కిరణ్ కోడలు శార్వారీ చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ, కంపెనీ సిబ్బంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# దాతల విరాళంతో గోవులకు కుట్టి దానం

● చౌడమ్మగుట్ట శ్రీకృష్ణ గోశాలకు18500 రూపాయలు విలువ గల కుట్టి దానం







**షాద్ నగర్ 18 మార్చ్ నేటి దర్శిని ప్రతినిధి** గో సంరక్షణ మనందరి బాధ్యతని, గోసేవతో ఎంతో పుణ్యాఫలం లభిస్తుందని నవదుర్గ కంపెనీ మేనేజర్ బోలా రాం అన్నారు. గురువారం అమావాస్యను పురస్కరించుకొని బాలానగర్ మండలం మోతి ఘనపూర్ లొని శ్రీ నవదుర్గ కంపెనీ యాజమాన్యం చౌడమ్మగుట్ట శ్రీకృష్ణ గోశాలకు పదివేల రూపాయల విలువగల కుట్టి దానం చేశారు. అదేవిధంగా తిరుమణి శంకర్ గౌడ్ సూచనతో పట్టణానికి చెందిన జె రామకృష్ణ గౌడ్ (కిట్టు) 6500/- రూపాయలు అశోక్ రెడ్డి 2000/- రూపాయలు విరాళంగా అందజేశారు. మొత్తం 18,500/- రూపాయలు విలువగల గో దాన (కుట్టిని) గోశాలకు అందజేశారు. గోవుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతినెల అమావాస్య రోజున పశుగ్రాసం అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పశువులకు కుట్టి దానం చేసిన నవదుర్గ కంపెనీ యాజమాన్యానికి దేవాలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు రాఘవేంద్ర చార్య, తిరుమణి శంకర్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య తదిరులున్నారు.

# మాత అన్నపూర్ణేశ్వరి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద వితరణ

**చంపాపేట్, మార్చి 18 (నేటి దర్శిని):** ‘అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పది” అని శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి (భగవాన్) పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో గత 35 నెలలుగా ప్రతి అమావాస్య రోజు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంపాపేట్ నల్లపోచమ్మ -- ఎర్రపోచమ్మ దేవాలయ ప్రాంగణంలో ఘనంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి ముదిరాజ్, సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, గణసాల వెంకటేష్ (చింటూ), ఆడేళ్ల రాజా, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్, కంటేకర్ తిలక్ రాజ్, కంటేకర్ విట్టల్, జమాల్‌పూర్ శివ, షానవాజ్ హుస్సేనీ, కర్నాటి మనోహర్, ఆడేళ్ల సంపత్, ఇట్టికల సాయికుమార్, ఆనగళ్ల జగదీష్, శ్రీను నాయక్, ఎడ్ల శివరామ్ రెడ్డి, రాదే కుమార్, గుర్రం పావని, ఎస్.



సంజీవ్ కుమార్, తిప్పిరెడ్డి స్వాతి, డి. సుభాష్, డి. సతీష్, డి. సందీప్, డి. సూర్యన్స్, ఆకుల దీప, గుంజి



వెంకట కోటేశ్వరరావు, రేండ్ల సారయ్య, వై. లక్ష్మీ నరసయ్య, మనోజ్, భవాని, సాత్తిరి మహేష్, ఉపేందర్ చారి, కేకే సూర్య తేజ, ఎం. దీపక్, మాడ కుట్నెస్, గాజుల నవీన్ కుమార్, నల్ల దేవేందర్, సాయి సాగర్, విజయ్ కుమార్, కే. రాము, ఎస్. సాయికుమార్, ప్రశాంత్ యాదవ్, గూడ శ్రీనివాస్, అభిలాష్, జి. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ నియోజక వర్గం గ్రాముల రోడ్లకు మహర్దశ

**కోటి55లక్షల నిధులు మంజూరు చేసిన ఎంపీ**
**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి**



**మిడ్జిల్,మార్చి 18, (నేటి దర్శిని ఉమ్మడి జిల్లా బ్యూరో):** మక్తల్ నియోజకవర్గం లోని నర్వ,ఉట్కూర్,మక్తల్,మాగనూర్, కృష్ణా మండలాలకు ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు వేయడానికి అడిగిన వెంటనే కోటి 55 లక్షల నిధులను పాలమూరు ఎంపీ డి కే అరుణ మంజూరు చేయించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి తెలిపా రు.ఈ సందర్భంగా ఆయన ఎంపీ డికే. అరుణ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ పనులను వీలైనంత త్వరలో పూర్తిచేయించాలని,పూర్తయిన సీసీ రోడ్లకు వెంటనే నిధు లు విడుదల చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు.సర్పంచ్ ఎన్నికలలో భాగంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకు ని మక్తల్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు కలిపి సీసీ రోడ్లు వేయడానికి రెండు కోట్ల రూపాయలకు పైగా విడుదల చేసిన అరుణమ్మ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి..

- కొత్తూరు సీఐ నరసయ్య
- రంజాన్,ఉగాది,శ్రీరామనవమి పండుగల నేపథ్యంలో కొత్తూరు పోలీస్ స్టేషన్ లో పీస్ కమిటీ సమావేశం



**కొత్తూర్ మార్చ్ 18 (నేటి దర్శిని ప్రతినిధి):** భిన్నత్వంలో ఏకత్వం భారతదేశం ప్రత్యేకత అని కొత్తూరు సీఐ నరసయ్య అన్నారు.బుధవారం కొత్తూరు పోలీస్ స్టేషన్ లో సిఐ నర్సయ్య ఆధ్వర్యంలో రంజాన్,ఉగాది,శ్రీరామనవమి పండుగల నేపథ్యంలో కొత్తూరు పోలీస్ స్టేషన్ లో పీస్ కమిటీ సమావేశం చేశారు.ఈ సందర్భంగా సిఐ నరసయ్య మాట్లాడుతూ.. మన సంప్రదాయాలను గౌరవిస్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో భక్తి భావంతో రంజాన్,ఉగాది, హనుమాన్ జయంతి,శ్రీరామనవమి పండుగలను నిర్వహించుకోవాలని అన్నారు. శాంతియుత, ఆనంద వాతావరణంలో, ఒకరి మతాచారాలను మరొకరు గౌరవించుకుంటూ భక్తిశ్రద్ధలతో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి వేడుకలను నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ ఆశయాల సాధనకు యువత ముందుకు రావాలి

- విద్యార్థి-యువజనోత్సవాలను జయప్రదం చేయండి




**దేవరకొండ, మార్చి 18 నేటి దర్శిని ప్రతినిధి :** దేశ స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ థాపర్ ల 95వ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న విద్యార్థి--యువజనోత్సవాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు భగత్ సింగ్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని, సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వ్యసనాలపై పోరాటం చేయాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్‌లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యనే ప్రధాన మార్గమని తెలిపారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రభుత్వాలు సరైన రీతిలో గుర్తించడం లేదని విమర్శించారు. చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు తగిన గౌరవం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. వారికి భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.రాజేష్, ఎం.లాలు, ఏ.ఈశ్వర్, ఎం.అఖిల్, సి.చరణ్, శివ గణేష్, కె.అజయ్, జె.రాజేష్, ఉదయ్ కుమార్, శ్రీధర్, మనోజ్, యశ్వంత్, శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అందేమోహన్ జన్మదిన వేడుకలు


- ఎమ్మెల్యే ఆశీస్సులు తీసుకున్న అందె మోహన్
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



**షాద్ నగర్ 18 మార్చ్ నేటి దర్శిని ప్రతినిధి**
షాద్ నగర్ మున్సిపాలిటీ 14వ కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ జన్మదినశీ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మర్యాద పూర్వకంగా కలిసి తన జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ఆశీస్సులు తీసుకున్న వైస్ చైర్మన్ అంధే మోహన్ ముదిరాజ్,ఈ సందర్భంగా శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మహమ్మద్ ఇబ్రహీం ముబారక్ అలీ ఖాన్,సయ్యద్ ఖదీర్, వెలిజర్ల గ్రామ సర్పంచ్ బాబు నాయక్ రవి మార్గం రాజేష్ కుమార్ శీను నాయక్,సుజీవన్, బాలరాజు గౌడ్ జంగా నరసింహులు కుమారస్వామి గౌడ్,ఇసాక్, తుపాకుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు..

# దేవరకొండ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, మార్చి 18 నేటి దర్శిని ప్రతినిధి :** దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగతో రైతులు వ్యవసాయ పనులను కొత్తగా ప్రారంభిస్తారని, ఇది వ్యవసాయానికి నాంది పలికే పర్వదినమని అన్నారు. ప్రకృతితో మమేకమై సబ్బండ వర్ణాలు కలిసి ఆనందంగా జరుపుకునే ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. చెట్లు పచ్చగా చిగురిస్తూ ప్రకృతి కొత్త ఉత్సాహాన్ని సంతరించుకుంటున్నట్లే ప్రజల జీవితాల్లోనూ ఆనందం నిండాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మిక వర్గాల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుని ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలని కోరారు. ఉగాది పచ్చడి మాదిరిగా జీవితంలో షడ్రుచులను స్వీకరిస్తూ ప్రతి పరిస్థితిని సమతుల్యంగా ఎదుర్కొంటేనే జీవితం పరిపూర్ణమవుతుందని తెలిపారు.ఈ నూతన సంవత్సరంలో సాగునీరు, తాగునీరు సమృద్ధిగా లభించి, పంటలు బాగా పండాలని, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆశించారు.

# సమాజానికి సేవే మహోన్నతం

- అన్నదానం కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్






**కొత్తపేట, మార్చి 18 (నేటి దర్శిని):** అన్నదానం మహాదానం అని, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పేర్కొన్నారు. అమావాస్య సందర్భంగా బీజేపీ నాయకులు ఊరెళ్ళి రామకృష్ణ ఆధ్వర్యంలో కమర్షియల్ టాక్స్ కాలనీ మైసమ్మ దేవాలయం వద్ద, అలాగే మోహన్ నగర్‌లో శ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో ఉపేందర్ సింగ్ ఠాకూర్ అన్నప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో సేవా భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. పేదలకు, అవసరమైన వారికి ఆహారం అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొగ్గారపు వరుణ్, బీజేపీ నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, రింకూ గౌర్, సంగ్రామ్, సాయి పాటిల్ మరియు స్థానిక ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదానం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి..

- సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్
- నూతన ఎమ్మార్వో ముంతాజ్ బేగంను సన్మానించిన ఎర్రోళ్ల జగన్, హరినాథ్ రెడ్డి,దయానంద్ గుప్తా
- ఉగాది,రంజాన్ పండుగ శుభాకాంక్షలు: సర్పంచ్ ఎర్రోళ్ల జగన్





**కొత్తూర్ మార్చ్ 18 (నేటి దర్శిని ప్రతినిధి)** అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు.కొత్తూరు మండల నూతన ఎమ్మార్వో గా బాధ్యతలు చేపట్టిన ముంతాజ్ బేగంను సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, సర్పంచ్ దయానంద్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వారి సమస్యలు తీర్చే అధికారులను ఎప్పటికీ గుర్తుంచుకుంటారు అని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు.

# ఎస్సెస్సీ పరీక్షలకు పకడ్బందీ బందోబస్తు

● చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి




**చింతపల్లి, మార్చి 18 నేటి దర్శిని ప్రతినిధి :**
చింతపల్లి మండల కేంద్ర పట్టణంలోని ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాల్లో పోలీసుల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు కేంద్రాలను ఎస్సై ముత్యాల రామ్మూర్తి స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు.

# సాయి సంస్థాన్‌లో కొనసాగుతున్న నిత్య అన్నదానం



**దిల్సుఖ్‌నగర్, మార్చి 18 (నేటి దర్శిని):**
శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దిల్సుఖ్‌నగర్‌లో నిత్య అన్నదానం కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. ఎల్పీజీ గ్యాస్ కొరత ఉన్నప్పటికీ ప్రతిరోజూ సుమారు 2,000 మందికి, గురువారాల్లో దాదాపు 4,000 మందికి అన్నప్రసాదం అందజేస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.ప్రస్తుతం గ్యాస్ కొరత కారణంగా పలు హోటళ్లు, హాస్టళ్లు మూతపడటంతో విద్యార్థులు, నిరుద్యోగులు, భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి తరలివస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ ఎవరినీ తిరస్కరించకుండా అందరికీ సాయి అన్నప్రసాదం అందజేయడం తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ నిత్యాన్నదాన మహాకార్యాన్ని మరింత విస్తరించేందుకు భక్తులు, దాతలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని ట్రస్ట్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ఉమ్మడి వరంగల్, మార్చి 18 (నేటి దర్శిని బ్యూరో):**
శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కరించుకొని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది పండుగ మన తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలిచే రోజు అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రతి ఇంట సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆనందం నిండాలని ఆకాంక్షించారు. గత సంవత్సరంలోని అనుభవాలను పాఠాలుగా తీసుకుని, కొత్త సంవత్సరాన్ని ఆశావాదంతో ఆహ్వానించాలని అన్నారు. ఉగాది పచ్చడిలాగే ప్రతి ఒక్కరి జీవితం కూడా షడ్రుచుల సంగమంగా మారాలని, సుఖదుఃఖాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలన్నారు.రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా ప్రతి వర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తూ, ప్రజల ఆశయాలను నెరవేర్చడానికి ఎల్లప్పుడూ మీతోనే ఉంటానని హామీ ఇచ్చారు.ఈ ఉగాది పండుగ ప్రతి కుటుంబంలో కొత్త ఆశలు, కొత్త అవకాశాలు తీసుకురావాలని, రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు.

# వేణుగోపాలస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

● వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి 94 లక్షలు మంజూరు చేసిన మంత్రి



**ఉమ్మడి వరంగల్, మార్చి 18(నేటి దర్శనీ బ్యూరో):**
వరంగల్ నగరంలోని శ్రీ వేణు గోపాలస్వామి దేవాలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని , దేవాలయం అభివృద్ధి కోసం 94 లక్షల నిధులు మంజూరు కి అనుమతి ఇచ్చామని తెలిపారు. అనంతరం అర్చకులు మంత్రికి వేద ఆశీర్వచనం ,తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయంలో జరిగిన మహా అన్నదానంలో మంత్రి పాల్గొన్నారు. దేవాలయానికి భక్తులు రాకతో ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో మారి మోగింది.

# వనస్థలిపురంలో అమావాస్య సందర్భంగా అన్నప్రసాదం





● పాల్గొన్న బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా



**ఎల్.బి.నగర్, మార్చి 18 (నేటి దర్శిని):**
అమావాస్య సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో వనస్థలిపురంలో అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 550 నుండి 600 మంది ప్రజలు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు 'జై శ్రీ కృష్ణ' నినాదాలతో కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తి భావంతో అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి సచిన్ అగర్వాల్, కోశాధికారి కుష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా, ఈసీ సభ్యులు సునీల్ దరాడే, సురేష్ ధావలే, పాకా సతీష్ యాదవ్, కె. నాగ్నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలుగా సమితి నిరంతరంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడిగా సేవలో భాగస్వామ్యమై సహకరించిన చింతల్ రవికుమార్‌కు సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కొడకండ్ల ఆస్పత్రి 30 పడకలకు అప్‌గ్రేడ్‌కు అడుగులు

● ప్రజా ఆరోగ్యంపై దృష్టి: కొడకండ్ల ఆస్పత్రి విస్తరణకు ఎమ్మెల్యే వినతి

● 7 పడకల నుంచి 30 పడకలకు... కొడకండ్లకు మెరుగైన వైద్య సదుపాయాల దిశగా చర్యలు



**ఉమ్మడి వరంగల్, మార్చి 18 (నేటి దర్శిని బ్యూరో):**
కొడకండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహను హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు. ప్రస్తుతం కొడకండ్ల ప్రభుత్వ ఆస్పత్రి కేవలం 7 పడకలతో మాత్రమే సేవలు అందిస్తున్నదని, పెరుగుతున్న జనాభా మరియు రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా విస్తరించడం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు.ఆస్పత్రి అప్‌గ్రేడ్‌తో ప్రాంతీయ ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు.ఎమ్మెల్యే వినతిని శ్రద్ధగా విన్న మంత్రి దామోదర్ రాజనరసింహ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి ఆస్పత్రి అప్‌గ్రేడేషన్‌కు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మంత్రి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించాలని కోరారు.

# ఉజ్వల భవిష్యత్తుకు ఈ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ తోడ్పడాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే నాగరాజు




**ఉమ్మడి వరంగల్, మార్చి 18 (నేటి దర్శిని బ్యూరో):**
తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని, కష్టాలు తొలగి ఆనందమయ జీవితానికి నాంది కావాలని ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది తెలుగు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని, కొత్త ఆశలు, లక్ష్యాలు, ఆలోచనలకు ఇది నాంది పలుకుతుందన్నారు.ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో ఉజ్వల భవిష్యత్తు నెలకొని, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడాలని కోరుకున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీల ద్వారా ప్రజల జీవితాల్లో సంతోషం పెరగాలని అభిలషించారు.ఇక ఈ సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, రైతులు అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, ఈ సంవత్సరం నిరుద్యోగులకు ఉద్యోగాల సంవత్సరం కావాలని ఆకాంక్షించారు.ఈ శ్రీ పరాభవ నామ సంవత్సర లో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని ఎమ్మెల్యే నాగరాజు ఆకాంక్షించారు.

# మిడ్జిల్ మండల ప్రజలకు రైతు సోదరులకు ఉగాది శుభాకాంక్షలు

● మిడ్జిల్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్. కూచూరు శ్రీనివాస్ రెడ్డి



**మిడ్జిల్, మార్చి18 (నేటి దర్శిని మహబూబ్నగర్ జిల్లా బ్యూరో):**
మిడ్జిల్ మండల ప్రజలకు రైతు సోదరులకు. కోపరేట్ బ్యాంక్ చైర్మన్ కూచూరు శ్రీనివాస్ రెడ్డి శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పర్వదినం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. చెట్లు పచ్చగా చిగురిస్తూ, ప్రకృతి మాత నూతనోత్సాహాన్ని సంతరించుకుంటుందని, అదే నూతనోత్సాహం ప్రజల జీవితాల్లో నిండాలని కోరుకున్నారు. రైతన్నలు, సబ్బండ వర్గాల సంక్షేమం దిశగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టి, ప్రజల జీవితాల్లో మరింతగా గుణాత్మక మార్పును తీసుకురావాలని ఆశించారు. ఉగాది పచ్చడి మాదిరి, జీవితంలో షడ్రుచులను ఆస్వాదిస్తూ ప్రతీ సందర్భాన్ని వివేచనతో ఎదుర్కోవడం ద్వారానే మంచి చెడులు అర్థమై జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని నల్లమోతు సిద్దార్థ తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో సాగునీరు తాగునీరు పుష్కలంగా లభించి, సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కూచూరు శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు.




# మార్చి 27న పెద్ది టీజర్ విడుదల

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'పెద్ది'. గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కావడానికి సిద్ధమవుతోంది. అయితే, ఇంకా షూటింగ్ మాత్రం కంప్లీట్ కాలేదు. రిలీజ్‌కు మరో ఆరు వారాల సమయం మాత్రమే ఉంది. మరి సినిమా అనుకున్న సమయానికి విడుదల అవుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో చిత్రబృందం షూటింగ్ పనుల్లో వేగాన్ని పెంచింది. తాజా సమాచారం ప్రకారం, సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కేవలం మరో పది రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉందట. ఈ చివరి షెడ్యూల్‌లో కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు, స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించబోతున్నారు. ఇక్కడితో పెద్ది షూటింగ్ కంప్లీట్ అయిపోయినట్టే. ఇదే స్పీడ్‌లో మార్చి 27న రామ్ చరణ్ బర్త్ డే గిఫ్ట్‌గా పెద్ది టీజర్ రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. అక్కడి నుంచి బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్‌తో ప్రమోషన్స్ స్పీడ్ పెంచనున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ అయిన పాటలు సెన్సేషనల్ చార్ట్ బస్టర్ అయ్యాయి. అలాగే.. స్పెషల్ సాంగ్ కోసం రెహమాన్ అదిరిపోయే మాస్ బీట్ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ పాటలో చరణ్‌తో కలిసి స్టెప్పులు వేయడానికి ఇద్దరు స్టార్ హీరోయిన్లను రంగంలోకి దింపుతున్నాడట బుచ్చిబాబు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# ఉస్తాద్‌పై పవన్ ఫ్యాన్స్‌లో ఉత్కంఠ

స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ ప్రస్తుతం,పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అభిమానుల్లో ఆసక్తి కొనసాగుతోంది. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పలేం. ఇటీవల విడుదలైన ట్రైలర్ కూడా ప్రేక్షకులకు ఓ మోస్తరుగా అనిపించిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ట్రైలర్‌లోని కొన్ని డైలాగులపై సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోల్స్ కూడా వచ్చాయి. 'ఈ సినిమాను కాపాడేది పవనే' అన్న కామెంట్లు కూడా వినిపించాయి. అయితే ఈ విమర్శలను పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్దగా పట్టించుకోవడం లేదు. సోషల్ మీడియాలో హరీష్ శంకర్‌పై వచ్చే నెగటివ్ కామెంట్లకు వారు గట్టిగా కౌంటర్ ఇస్తూ దర్శకుడికి మద్దతుగా నిలుస్తున్నారు. ఉస్తాద్ భగత్ సింగ్' ఒక రీమేక్ అనే ప్రచారం మొదలైన సమయంలో పవన్ ఫ్యాన్స్‌లో కొంత అసంతృప్తి కనిపించింది. అప్పట్లో హరీష్ శంకర్‌పై విమర్శలు కూడా వచ్చాయి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారినట్లు కనిపిస్తోంది. సినిమా విడుదలకు దగ్గరపడుతున్న వేళ అభిమానులు దర్శకుడికి పూర్తి మద్దతు ఇస్తున్నారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా కోసం హరీష్ శంకర్ ఎన్నేళ్లుగా ఎదురుచూశాడన్న విషయం కూడా అభిమానులకు తెలిసిందే. సుమారు ఐదేళ్ల క్రితమే ఈ ప్రాజెక్ట్ అనుకున్నప్పటికీ వివిధ కారణాలతో ఆలస్యమైంది. మధ్యలో 'మిస్టర్ బచ్చన్' సినిమా కోసం కొంత సమయం వెచ్చించినా, మిగతా కాలం మొత్తం పవన్ సినిమా కోసం వేచి చూశారు. సినిమా ఫలితం ఎలా ఉంటుందన్నది పక్కన పెడితే, పవన్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని 'ఉస్తాద్ భగత్ సింగ్'ను తెరకెక్కించాడనే నమ్మకం ఫ్యాన్స్‌లో కనిపిస్తోంది.



# అందంతో కట్టిపడేస్తున్న లిటిల్ హార్ట్స్ బ్యూటీ.


హీరోయిన్ శివాని నాగారం గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. షార్ట్ ఫిల్మ్స్ నుంచి సినీరంగంలోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ.. ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. లిటిల్ హార్ట్స్ సినిమాతో తెలుగులో పాపులర్ అయ్యింది. ఇటీవలే హే బలవంత్ సినిమాలో నటించింది .గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 2024లో నటిగా మంచి అరంగేట్రం చేసి విమర్శకుల ప్రశంసలు అందుకున్నానని, 2025 నాటికి మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నానని, 2026 నాటికి పూర్తి కమర్షియల్ నటిగా మారుతున్నట్లు అనిపిస్తుందని తెలిపింది. తాను సినిమాల ఎంపికలో "క్వాలిటీ ఓవర్ క్వాంటిటీ"కి ప్రాధాన్యత ఇస్తానని, ఎన్ని సినిమాల్లో నటించామన్నది కాదని, ఎలాంటి కంటెంట్ ఉన్న సినిమాల్లో నటించామన్నదే ముఖ్యమని నమ్ముతానని చెప్పుకొచ్చింది..అలాగే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఓ హీరో గురించి చెప్పింది. శివాని కో యాక్టర్, హీరో సుహాస్ పై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'నాకు సుహాత్‌తో ఇది రెండో సినిమా. వెరీ స్పెషల్ ఈ మూవీ నాకు.. ఎందుకంటే అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ లో సుహాస్ నాకు అన్ని విషయాల్లో చాలా సపోర్టీవ్‌గా నిలిచాడు. నాకు సినిమా ఇండస్ట్రీలో చాలా సపోర్టీవ్ పర్సన్ అంటే సుహాసే.అతను నాకు చాలా హెల్ప్ చేశాడు. ఇప్పుడు ఈ సినిమా నాకు చాలా చాలా స్పెషల్. సుహాస్ తో మరో సారి స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా హ్యాపీగా ఉంది' అని చెప్పుకొచ్చింది శివానీ. ప్రస్తుతం ఈ బ్యూటీ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.



# ట్రెండింగ్‌లో ఉస్తాద్ భగత్ సింగ్ బ్యూటీ నయా లుక్

పవన్ కల్యాణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీ రోల్ పోషిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు.ఈ చిత్రాన్ని ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో హరీష్ శంకర్, రాశీఖన్నా అండ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. పవన్ సినిమా అంటే సెపరేట్ మాస్ డైలాగ్స్ ఉంటాయని తెలిసిందే. ప్రత్యేకించి ఉస్తాద్ భగత్ సింగ్‌లో ఇచ్చిపడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం అంటూ వచ్చే డైలాగ్ సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. విడుదలకు ముందే సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ప్రమోషన్స్‌లో ఇదే డైలాగ్‌తో సినీ జనాల్లోకి వెళ్తోంది రాశీ ఖన్నా. ఇచ్చిపడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం డైలాగ్‌తో డిజైన్ చేసిన బ్లాక్ షర్ట్ వేసుకుంది రాశీఖన్నా. షర్ట్ వెనుకవైపు రాసి ఉన్న డైలాగ్‌ను చూపిస్తున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో పార్థిబన్ విలన్‌గా నటిస్తుండగా.. గౌతమి, కేఎస్ రవికుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఆ దర్శకుడికి ఓకే చెప్పాడా?



ఏపీలో ఎన్నికల హడావిడి ముగియగానే, ముందు ఒప్పుకున్న సినిమాలన్నీ చకచకా పూర్తి చేశారు పవన్‌కల్యాణ్. ఓ స్టార్ హీరో ఎనిమిది నెలల్లో మూడు సినిమాలు విడుదల చేయడమంటే ఈ రోజుల్లో సామాన్యమైన విషయం కాదు. త్వరలో ఆయన సురేందర్‌రెడ్డి సినిమాను పట్టాలెక్కించనున్నారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్'కి ఇచ్చినట్టే ఈ సినిమాక్కూడా కాల్‌షీట్స్ 45 రోజులే ఇచ్చారట పవర్‌స్టార్. ఇకనుంచి ఏడాదికి రెండు సినిమాలు విడుదల చేయాలనేది పవన్‌కల్యాణ్ నిర్ణయం. అందులో భాగంగా సురేందర్‌రెడ్డి సినిమాతో పాటు మరో ప్రాజెక్టుకు కూడా లైన్‌లో పెట్టేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి పవన్‌కల్యాణ్ ఓ సినిమా చేయబోతున్నారు. తమిళ దర్శకుడు మోహన్‌రాజా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారట. ఇటీవలే ఆయన కథ కూడా వినిపించినట్టు టాక్. చిరంజీవి 'గాడ్‌ఫాదర్' సినిమాకు మోహన్‌రాజానే దర్శకుడు. అలాగే రామ్‌చరణ్ 'ధృవ'కు మాతృక అయిన 'తని ఒరువన్'కూ దర్శకుడు మోహన్‌రాజానే. స్టైలిష్ మేకర్ అనే పేరుతో పాటు.. సినిమాను వేగంగా పూర్తి చేస్తాడనే గుడ్‌విల్ కూడా మోహన్‌రాజాకు ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పవన్‌కల్యాణ్‌కు కావాల్సింది కూడా అదే. కాబట్టి ఈ సినిమా దాదాపు ఖరారైనట్టే. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365